కథ

# ఆశ్రమ - ఆశ్రయం

- వి.యన్. మంజుల

**ఓదార్పు నిచ్చే చల్లని గాలులూ, సేదతీర్చే చెట్ల నీడలు, నవ్వుతూ పలుకరించే పూలగుత్తులూ, పండిన వయసుతో వృద్ధ జీవులూ - అణువణువునా స్వచ్ఛత చిహ్నాలే "ఆత్మబంధు వృద్ధాశ్రమం"లో. ఓ లేతమొక్కకి ఓపిగ్గా కుదురు చేస్తున్నాడు 70 ఏళ్ళ రామచంద్రయ్య.** కొడుకులిద్దరూ చదువులయ్యి - ఉద్యోగాల రీత్యా పరాయిదేశంలో బానిసత్వం చేస్తున్నారు. భార్య సుగుణ. రెండేళ్ళ క్రితం కన్నుమూసింది. రోజూ ఉదయాన కాసేపు - రాత్రి కాసేపు ఆ మొక్క పక్కగా కుర్చీ వేసుకుని కూచుంటాడు ఆలోచనల సాంగత్యంతో. "మనసులో మాట మనిషికన్నా, మానుకు చెప్పుకుంటేనే నయం", అన్నది ఆయన నమ్మకం.

దీర్ఘాలోచనలో వున్న రామచంద్రయ్యాకి,

"మాష్టారూ ! మాష్టారూ !" అన్న గట్టి పిలుపు వినపడింది.

"ఆ ... ఆ ..... క్షమించండి, ఏదో ఆలోచనలతో వున్నాను. మీ పిలుపు వినిపించలేదు" అన్నాడు జరిగిన పొరపాటు గ్రహిస్తూ.

"ఆ ... దానిదేముంది లెండి .... ఫరవాలేదు" అన్నాడా వచ్చిన వ్యక్తి.

అప్పుడు గమనించాడు రామచంద్రయ్య ఆ వచ్చిన వ్యక్తిని. 60 సం.రాలు మించని వయసు. నలుపు, తెలుపులు సమంగా కలబోసిన తల వెంట్రుకలు, పైజామా, లాల్చీ వేసుకుని వున్నాడు. కళ్ళకి జోడు, చేతిలో బ్యాగు.

"ఇంతకీ ..... మీరు ..... " అన్నాడు ప్రశ్నార్థకంగా రామచంద్రయ్య.

"చూసారా ! నాదీ పొరపాటే ! .... " అన్నాడాయన.

"ఎదుటి వారికి హానికలిగించని పొరపాట్లెన్నైనా ఫరవాలేదీ రోజుల్లో" అన్నాడు రామచంద్రయ్య లేచి నవ్వుతూ.

"అవును. మీరన్నది నిజమే. నాపేరు మాధవరావు. ఈ ఆశ్రమం ఇన్‌చార్జిని కలవాలి ? ఎక్కడ కలవాలి ఆయన్ను" అని అడిగాడు.

"ఆయన పేరు రామకృష్ణారావుగారు. ఈ సమయంలో ఆయన సంధ్యాసేవ ఏర్పాట్లు చూస్తూ ఆ హాలులో వుంటారు. వెళ్ళండి. మనిషి చిన్నవాడైనా మనసు దొడ్డమనసు" అంటూ ఆవైపుగా చేయి చూపించాడు.

"ధన్యవాదాలండీ !" అంటూ నాలుగడుగులు ముందుకేసిన మాధవరావు మళ్ళీ వెనక్కి రావటం చూసిన రామచంద్రయ్య -

"నే వచ్చి చూపించనా ?" అంటూ ప్రశ్నించాడు.

"పెద్దవారుగా దోవ చూపించారు. వెళ్ళటం నా

తారణనామ ఉగాది సందర్భంగా రంజని నిర్వహించిన
రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

కర్తవ్యం. అయినా నే వచ్చింది మీ పరిచయం కోసం" అన్నాడు.

"ఓ నే చెప్పలేదు కదూ ! .... నా పేరు రామచంద్రయ్య. నేను ఆ చివరి గదిలో వుంటాను" అంటూ అటుకేసి చూపించాడు.

"సరేనండి ! మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను" అంటూ కదిలాడు మాధవరావు. ఆ మాటల ద్వారా అతనిక్కడ చేరబోతున్నాడన్నది అర్థమయ్యింది రామచంద్రయ్యకు.

మరో రెండురోజులకు భోజనం కానిచ్చి బయటికి వస్తున్న రామచంద్రయ్య "బాగున్నారా రామచంద్రయ్య గారూ?" అన్న పలకరింపుకి పక్కకి చూసారు, మాధవరావు.

"ఓ ... మీరా ! మీరిక్కడ జాయిన్ అయ్యారా ?" అంటూ ప్రశ్నించాడు.

"అవునండీ ! ఇవాళ ఉదయానే వచ్చాను. మీ గదికి రెండు గదుల ఇవతలగా గది ఇచ్చారు" అన్నాడు మాధవరావు ఇద్దరూ నడుస్తుండగా, మధ్యలో కలిసిన ఆశ్రమ వాసులకు మాధవరావుని పరిచయం చేసారు రామచంద్రయ్యగారు. ఆశ్రమ పద్ధతులనూ, వివరాలనూ తెలియజేసాడు ఆ పెద్దాయన.

"ఇక వెళ్తానండీ ! మీరు కూడా విశ్రాంతి తీసుకోండి. నా వలన మీకివాళ కాస్త శ్రమ, ఇబ్బంది కలిగింది కదండీ!" అన్నాడు నొచ్చుకున్నట్లుగా మాధవరావు.

"అబ్బే .... అలా ఏం అనుకోకండి. నాకెవరైనా మాట్లాడడానికి లేకపోతేనే కాస్త ఇబ్బంది. అన్నట్టు ఇవాళ సాయంత్రం 6 గం. లకి రామాయణ కథా కాలక్షేపం వుంది. వస్తారుగా !" అన్నాడు.

"తప్పకుండా ! అలా అయితే సాయంత్రం అక్కడే కలుద్దాం వుంటానండీ !" అంటూ తన రూమ్ కేసి నడిచాడు మాధవరావు.

కొద్దిరోజులకే వారిద్దరి మధ్యా మంచి స్నేహం కుదిరింది. ఓ సాయం సమయాన మొక్క పక్కగా కుర్చీవేసుకుని దీర్ఘాలోచనలో వున్న రామచంద్రయ్యను గమనించిన మాధవరావు వచ్చి పక్కనున్న గట్టుపై కూచుంటూ, "ఏమిటండీ అదోలా వున్నారు ? ఆరోగ్యం బాగోలేదా ?" అంటూ ప్రశ్నించాడు.

"ఈ వయసులో ఆరోగ్యం బాధకన్నా, మనసు బాధ ఎక్కువ హాని కలిగిస్తుంది. కాదంటారా ?" అన్నాడు జవాబుగా.

"మనసు బాధకి వయసుతో సంబంధం లేదులెండి".... అన్నాడు ముక్తసరిగా మాధవరావు.

"వయసులో వున్నవారి విషయం వేరు. మనలా వయసుపైబడిన వృద్ధుల విషయం వేరు కదా !" అన్నాడు రామచంద్రయ్య. తలవూపి వూరుకున్నాడు మాధవరావు తర్కం ఎందుకన్న రీతిన. పిల్లలు విదేశాలకి వెళ్ళడం, తనూ, భార్య ఆశ్రమంలో చేరడం, పిల్లలకీ – తమకీ వచ్చిన మనస్పర్థ – భార్య పోవడం అంతా వివరించి చెప్పాడు మాధవరావుకి. ఆయన కళ్ళలో నీళ్ళని ఆవేదనని గమనించిన మాధవరావు ఓదార్పుతో, "బాధపడకండి, మీ అబ్బాయిల్లో ఎవరో ఒకరు వచ్చి మిమ్మల్ని కలుస్తారు లెండి. ధైర్యంగా వుండండి" అన్నాడు.

"వాళ్ళు రెండు, మూడుసార్లు వచ్చారు. కానీ నేనే వాళ్ళని కలవలేదు. వాళ్ళ మొహం చూడటం నాకిష్టం లేదని పంపించేసాను" అన్నాడు ఉద్రేకంగా రామచంద్రయ్య.

"శాంతించండి. నెమ్మది. మీ ఆరోగ్యం దెబ్బతింటుంది" అంటూ హెచ్చరించాడు మాధవరావు.

"మీరే చెప్పండి. వాళ్ళిక్కడే వుంటే – మనుమళ్ళతో మేమిద్దరం హాయిగా మా శేషజీవితాన్ని గడిపేవాళ్ళం కదా! ఇక్కడ ఒంటరిగా వేముండలేమంటే మాతో

వచ్చేయండంటారు. సొంతగడ్డ వదలి రామని ఖచ్చితంగా చెప్పేసాం. మామాట వాళ్ళు విననప్పుడు, వాళ్ళ మాట మేమెందుకు వినాలండీ ? తప్పువాళ్ళది కాదంటారా ?" అంటూ ఎదురు ప్రశ్నించాడు రామచంద్రయ్య - మాధవరావుని.

అవుననడమే ఆ సమయాన ఉత్తమమనిపించి, "అవునన్నట్లుగా" తలవూపాడు మళ్ళీ అదే ధోరణిలో.

"తల్లి పోయిందన్న కబురు విని అప్పుడు బయలుదేరి వచ్చారు అన్నదమ్ములిద్దరూ. కోడళ్ళూ, పిల్లలూ రానేలేదు. ఏమన్నా అంటే వీసాలు, టిక్కెట్లూ దొరకలేదన్నారు. చివరి క్షణంలో పక్కన కన్నపిల్లలు లేకపోవటం ఎంత దౌర్భాగ్యం-ఆఖరి నిమిషం వరకూ ఆ పిచ్చిది "ఏమండీ! పిల్లలొచ్చారా ? ఎప్పుడొస్తారు ? ఒక్కసారి వాళ్ళని చూడాలనుందండీ ?" అంటూ నా భార్య ఏడుస్తూంటే, ఏం చెప్పాలో దిక్కుతోచలేదు నాకు అంటూ కన్నీళ్ళు రాల్చాడు రామచంద్రయ్య.

ఆయన్ని ఓదార్చుతూ - భుజం చుట్టూ చేతులు వేసిన మాధవరావు, "గతం తలుపు తట్టకండి. శాంతించండి. గతం గతః ముందసలు మీరిక్కడ నుండి లేవండి. కాసేపలా నడిచివద్దాం రండి" అంటూ బలవంతంగా ఆయన్ను లేపి తీసుకొని వెళ్ళాడు. దారిలో మిత్రులు కలవటం - వారి మాటలతో రామచంద్రయ్య తిరిగి మామూలు స్థితికి వచ్చాడు. ఇక నడవలేక.

"మొత్తానికి నా ఉద్రేకాన్ని శాంతపరిచారు. థాంక్స్. ఏదో అలా ఒక్కోసారి అనుకోకుండానే భావోద్రేకంలో బాధవెళ్ళగక్కుతాం. ఇక నడవలేను. రూమ్‌కి వెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుంటాను" అన్నాడు రామచంద్రయ్య.

"అలాగే పదండి. ఇక ఆలోచనలు మాని హాయిగా నిద్రపొండి" అన్నాడు మాధవరావు.

"అలిసిపోయాగా. తొందరగానే నిద్రపడుతుంది లెండి" అంటూ తన గదికేసి నడిచాడు రామచంద్రయ్య.

మరో రెండు రోజుల తరువాత, మరో ఆశ్రమవాసి గోవిందరావుకి ఆరోగ్యం బాగోలేదని తెలిసిన రామచంద్రయ్య, మాధవరావుని తీసుకొని బయల్దేరారు ఆయన గదికి.

"గోవిందరావూ, నేను ఓవారం తేడాలో ఇక్కడ చేరాము. వాళ్ళది రాయలసీమ. కర్నూలు జిల్లా. అప్పటి నుండీ మా పరిచయం. ఆయన భార్య కూడా ఇక్కడే వుండేది. ఏడాది అయ్యింది చనిపోయి. మా ఆవిడా, ఆవిడా మంచి స్నేహితులిక్కడ" అంటూ గోవిందరావు గురించి చెప్పాడు మాధవరావుకి. వీళ్ళు వెళ్ళేసరికి అక్కడ మరో ఇద్దరు సహచరులు కూచుని వున్నారు. వీళ్ళని చూసిన కేశవయ్య అనే ఆయన, "రండి రామచంద్రయ్యగారూ ! ఏదో నలుగురం కనిపిస్తే మన గోవిందరావుకి మనోధైర్యమని వచ్చాం".

"అంతకన్నా ఏం చేయగలం చెప్పండి మనం. ఒకరికొకరం ధైర్యం చెప్పుకోవటం తప్ప" అన్నాడు అక్కడున్న బల్లపై కూర్చుంటూ.

"బతికినంతకాలం బతకటం. పిల్లలూ - పిల్లలూ అనుకుంటాం కానీ లేకపోతే ఒకే మాటతో సరిపెడతాం "ఖర్మ" అని. పిల్లలుండీ ఈ వేదన తట్టుకోలేం" అన్నాడు గోవిందరావు కాస్త బాధనిండిన స్వరంతో. "ఏంచేస్తాం. ఇదీ తలరాతే. మనమే ఇలా విలవిలలాడుతుంటే కన్నతల్లులు ఎలా భరిస్తారండీ ఈ నరకాన్ని అన్నాడు సత్యన్నారాయణ అన్నాయన.

"ఆ బెంగతోటే వాళ్ళు మనకన్నా ముందే గాలిలో కలిసిపోయారు. చచ్చి సుఖపడటం అంటే అదేనేమో !" అన్నాడు గోవిందరావు రామచంద్రయ్యకేసి చూస్తూ దీనంగా!

వీరంతా ఇంతగా మాట్లాడుతున్నా, మాధవరావు మాత్రం పెదవివిప్పలేదు - ఓ పలుకు పలకలేదు. గంభీరంగా వుండి వీళ్ళ మాటలు ఆలకిస్తున్నాడు. అది గమనించిన కేశవరావు.

"ఏమండీ ! మాధవరావుగారూ ! అదోలా వున్నారు? ఏం మాట్లాడరేం ? మీ పిల్లలూ అలా ఉద్వాసన పలికిన విషయం గుర్తుకొచ్చిందా ? ఏమిటి ?" అంటూ ప్రశ్నించాడు.

"ఇందులో అనడానికేముంది లెండి ఎవరి పరిస్థితి వారిది" అన్నాడు. "ఒకరిని మించిన దీనస్థితి ఒకరిది. కొడుకూ లేదూ - కోడలూ లేదూ అంతా అవసరం తీరేవరకే. చూడొచ్చేసరికి మొహం చాటేస్తారు" అన్నాడు సత్యనారాయణ.

"సత్యం పలికారు. నా విషయం అదేగా ? ఒక్కగానొక్క కూతురు. ఘనంగా పెళ్ళి చేశా. అన్నీ ముట్టచెప్పా. తన తల్లిదండ్రుల్ని అపురూపంగా చూడాలని శాసించే అల్లుడు, భార్య మాత్రం తన కన్నవార్ని పలుకరించడానిక్కూడా వీలులేదన్నాడు. ఆస్తి మాత్రం కావాలిట. "అదేదో రాసిచ్చేసేయ్ నాన్నా ! అప్పుడైనా నన్ను మీ దగ్గరికి రానిస్తారాయన" అంటుంది నా గారాల కూతురు" అన్నాడు కేశవయ్య కళ్ళూ చేతులూ తిప్పేస్తూ.

"ఆస్థికి కాగితం కావాలిటా ? బంధానికి కాగితాలు లేవటనా ?" అన్నాడు గోవిందరావు.

"అనేగా వారి ఉద్దేశం. మమ్మల్నెవ్వరూ చూడక్కర్లేదనీ, ఎవరూలేని వారంతా ఒక్కటిగా వుండే ఈ ఆశ్రమమే మేలని ఇక్కడ చేరాము" అన్నాడు కేశవయ్య.

"మేమంతా ఇలా బాధని పంచుకుంటుంటే, మీరు మాత్రం మీ బాధని అలా గుండెల్లో ఎలా వుంచుకోగలుగుతున్నారు మాధవరావుగారూ ? పంచుకుంటే తరిగేది బాధ. దాచుకుంటే వచ్చేది దుఃఖం" అన్నాడు సత్యనారాయణ మాధవరావుని చూస్తూ.


వారంతా అలా తనని తరచి తరచి అడగటం మాధవరావుకి నచ్చలేదు. "తీరని బాధని తవ్వుకోవటం ఎందుకండీ ? జరిగేది జరగకపోదు" అన్నాడు కాస్త కఠినంగా.

పరిస్థితి అనుకూలంగా లేదనిపించిన రామచంద్రయ్య లేచినిలబడి "నిజమే లెండి ! మేమంతా వెళతాం. ఇంకేం ఆలోచించకుండా కాసేపు ప్రశాంతంగా నిద్రపొండి" అంటూ బయలుదేరి వెళ్ళిపోయారు. తన గదిలోకి వచ్చి పడుకున్న రామచంద్రయ్యకు ఎంత ప్రయత్నించినా గత తాలూకు ఆలోచనలు వదలట్లేదు. వాస్తవ ప్రపంచ స్పర్శని విస్మరించాడు. కళ్ళముందు ఆనాటి వేదనలూ, ఆవేదనలూ, రోదనలూ కదిలాయి. భార్య శోకదేవతలా కనిపించింది. పిల్లలు నరరూప రాక్షసుల్లా వాదించి వేధించిన దృశ్యాలు కదలాడాయి. నిస్సత్తువ కమ్ముకొచ్చి, కళ్ళు మూసుకుపోయి అలా కొద్దిసేపు నిస్తేజంగా వుండిపోయాడు రామచంద్రయ్య.

కాసేపటికి తేరుకున్న రామచంద్రయ్య గోడని ఆసరాగా చేసుకొని లేచి మాధవరావు గదికి బయలుదేరాడు. సమయం చూశాడు. 12.45 ని.లు అర్థరాత్రి. మాధవరావు చెప్పే ధైర్యవచనాలు ఇప్పుడు తనకు అవసరమని గ్రహించి వచ్చి మాధవరావు గది తలుపు తట్టాడు.

మరో రెండు నిమిషాలకి గది తలుపులు తెరుచుకున్నాయి. అంతే ! అటు లోపల వ్యక్తి, ఇటు బయట నిలబడ్డ రామచంద్రయ్యా, ఇద్దరూ నిశ్చేష్టులై పోయారు. కళ్ళప్పగించి చూసుకుంటూండిపోయారు. ఇద్దరికీ నోట మాట రావట్లేదు. కలా ! నిజమా ! ముందుగా తేరుకున్న రామచంద్రయ్య, "మీరు ! మీరు ఎవరు ? ఇది

మాధవరావు గదేనా ? లేక నేను కంగారులో పొరపడ్డానా?" అంటూ రూము నెంబర్ కోసం అటూ, ఇటూ చూడసాగాడు రామచంద్రయ్య.




ఆయనకా అనుమానం రావటానికి కారణం, ఆ తలుపు తీసిన వ్యక్తి ఓ యువకుడు. తల వెంట్రుకలు నల్లగా నిగనిగలాడుతున్నాయి. వయసు సుమారు నలభై ఉండవచ్చు. కాని ఎక్కడో చూసిన భావన. రామచంద్రయ్య ఇబ్బందిని గమనించిన ఆ వ్యక్తి, రామచంద్రయ్య గారికి నుదిటిన పట్టిన చెమటని, కంగారుని గమనించి, "ముందు లోపలికి రండి ! ఏమయ్యింది ? ఆరోగ్యం బాలేదా ?" అని అడుగుతూ, భుజాన చెయ్యి వెయ్యబోయాడు మాధవరావు. "భూజాన వెయ్యబోయిన చేయిని మధ్యలోనే విదిలించి కొట్టాడు – "ముందు చెప్పు. ఎవరు నువ్వు. మాధవరావువేనా ?" అంటూ ప్రశ్నించాడు కాస్త గట్టిగా.

"ఒక్కక్షణం" అంటూ వెళ్ళి గది తలుపులు గొళ్ళెం పెట్టి వచ్చాడు.

"నన్ను క్షమించండి రామచంద్రయ్యగారూ ! నేనే మాధవరావుని" అన్నాడు స్థిరంగా. ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు ఆయన.

"ఏమిటి ? మీరు .... నువ్వు .... నువ్వు మాధవరావువా ! మోసం, దగా ఎందుకు ? ఎందుకు చేశావీ పని. చెప్పు ..... చెప్పు ముందు" అంటూ ఆవేశంతో ఊగిపోతున్నాడాయన.

"రామచంద్రయ్యగారూ ప్లీజ్ ! నా మాట వినండి. మీకసలే ఆరోగ్యం బాగోలేనట్టుంది. శాంతించండి అంటూ చేతులు జోడించాడు. ఆయన ఉద్రేకాన్ని, నిస్సహాయత, నిస్సత్తువలు జయించడంతో కుర్చీలో జారిగిలబడి, కళ్ళు మూసుకుని కూచుండిపోయాడు. "ఇన్నాళ్ళూ నా గతం కానీ, మనసు వేదనని కానీ ఏనాడూ మీకెవరికీ చెప్పుకోవట్లేదని అనేవారు కదూ మీరందరూ. దయవుంచి నే చెప్పేది వినండి. ఆ తరువాత కూడా నే చేసింది మీకు తప్పుగా అనిపిస్తే, చెప్పండి. నా అంతట నేనే ఇక్కడినుండీ

వెళ్ళిపోతాను" అన్నాడు ఓ నిశ్చయానికి వచ్చిన వాడిలా మాధవరావు.

"కాలయాపన చేయకు. ముందు విషయం చెప్పు. అయినా ఈ విషయం మేనేజ్‌మెంట్ వారికి తెలిస్తే ఎంత ప్రమాదమో తెలుసా ? ఇది వృద్ధుల ఆశ్రమం" అన్నాడు కోపంగా రామచంద్రయ్య.. "ఆధారం లేని వృద్ధుల ఆశ్రమమని తెలుసు. నేనూ ఆధారం లేని వాడినే. వృద్ధుడినే" అన్నాడు బాధనిండిన స్వరంతో.

"మీరు .... నువ్వు వృద్ధుడివా ? ఎలా ?" అన్నాడు కాస్తంత వెటకారంగా రామచంద్రయ్య.

"వృద్ధాప్యం వయసుకే కాదు. మనసుకి కూడా వస్తుంది రామచంద్రయ్యగారూ ! మీరంతా వయసు పండిన వారైతే, నేను అనుభవాలతో ఎదురుదెబ్బలతో వయసు పండిన వృద్ధుడిని" అన్నాడు దీనంగా, మాధవరావు.

"అదటుంచు. ముందు కారణం వివరిస్తావా ? లేదా ?" అంటూ లేచి నిలబడ్డాడు.

"తప్పకుండా. ఆ అవకాశం ఇచ్చారు అంతేచాలు. ముందు మీరు కూచోండి" అంటూ కుర్చీ చూపించాడు మాధవరావు.

మాధవరావు ఏం చెప్తాడా ? అనే ఆశక్తితో వినడానికి సిద్ధమయ్యాడు రామచంద్రయ్య.

"మీరనుకున్నట్టు నేను యువకుడినే. నా వయసు 40 సం.రాలు. మాది ప్రకాశం జిల్లా. నా తల్లిదండ్రులకి నేనే పెద్ద కొడుకుని. నా కిద్దరు తమ్ముళ్ళు. ఇద్దరు చెల్లెల్లు. తండ్రికి కుటుంబ భారం ఎక్కువని నా చదువుని ఆరుతోటే మాన్పించి పొలం పనులకి తీసుకెళ్ళేవారు మా అమ్మా నాన్నా. నా తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ బాగానే చదువుకున్నారు. నాకు 20-25 ఏళ్ళు వచ్చేసరికి ఒక్కడినే పొలం బాధ్యతలనూ, ఇంటి బాధ్యతలూ సమర్థించేవాడిని. వాళ్ళ ఉద్దేశంలో నేనో బీడువారిన పొలాన్ని. నాకు ఏనాడు తల్లిదండ్రుల ప్రేమానురాగాలూ, ఆప్యాయతలు రుచి చూసే అదృష్టం కలుగలేదు. కానీ నా కళ్ళముందే తమ్ముళ్ళనీ, చెల్లెల్లనీ ప్రేమగా చూడడం చూసి నా మనసు విలవిలలాడేది" మాధవరావు కంఠం వణికింది. మాట పెగలట్లేదు అతనికి. ఈలోపు రామచంద్రయ్య "తల్లిదండ్రులకి పిల్లలందరూ ఒకటే. చెడ్డ కొడుకు వుంటాడేమో కానీ, చెడు తల్లి ఈ సృష్టిలోనే లేదనే నానుడి వినలేదా నువ్వు ?" అన్నాడు మాధవరావుని వ్యతిరేకిస్తూ "విన్నాను. కానీ నేనా నానుడిని నమ్మను. నా అనుభవం నేర్పిన సారం నన్ను నమ్మనీయదు. తల్లిదండ్రులు, పెద్దలూ అందరూ కలిసి ఆ నానుడిని బలోపేతం చేసారు. చేస్తున్నారు. మన పురాణాలలోనే వుంది తల్లి పిల్లల పట్ల ఎలా వివక్ష చూపిందీ అన్న విషయం" అంటూన్న మాధవరావు మాటలకి ఏదో అనబోతున్న రామచంద్రయ్యను మధ్యలోనే అడ్డుకుని –

"నాకు తెలుసు మీరనబోయేది. వాటి వెనుక కారణాలనేకం అనేగా. ప్రతిదానికీ కారణాలుంటాయండీ. అలాగే నా బాధకీ, వేదనకీ కూడా కారణం ఉంది. మన నేల సంస్కృతీ, సంస్కరం మట్టిపాలు కాకుండా ఇలాటి నానుడులనీ, చరిత్రనీ అడ్డుగోడలుగా నిలుపుతున్నారు. అది మంచిదే. నేనూ ఏకీభవిస్తాను. కానీ అనుభవించిన బాధ మాటలనిపిస్తోంది" అన్నాడు మాధవరావు.

"నువ్వు వారి కన్నబిడ్డవి కాదా ?" అని అడిగాడు కాస్తంత అనుమానంతో రామచంద్రయ్య.

ఓ చిన్న నవ్వు నవ్వి, "నవమాసాలు మోసిన కన్న కొడుకునే. చెప్పినా నమ్మని నిజం. మిగిలిన పిల్లలకోసం నన్ను బలిపశువుని చేసారు. వాళ్ళ బాగోగులు ఆలోచించారు కానీ, నాకూ చదువు చెప్పించాలని కానీ, పెళ్ళి చేయాలన్న ఆలోచన కూడా వారికి వచ్చినట్టుగా

నాకేనాడూ అనిపించలేదు. పోనీలే అందరూ నావాళ్ళే, వాళ్ళతోటే నా జీవితం అనుకున్నాను. పెళ్ళి వీరందరినీ మించిన అవసరం అని అప్పుడు నాకనిపించలేదు. కానీ ఈనాడు నాకంటూ భార్యా, పిల్లలూ వుంటే ఈ ఒంటరితనం వుండేది కాదేమో ! నా బాధనీ, వేదననీ పంచుకుని ఓదార్చే తోడు వుండేదేమో అనిపిస్తుంది" అన్నాడు గంభీరంగా మాధవరావు. ఎందుకో ఈ మాటలకి రామచంద్రయ్యా గార్కి మనసులో ఓ చిన్న కదలికి అనిపించింది.

"అవునూ ! ఇంతకీ ఇలా దూరంగా రావటానికి కారణం ఏమిటి ?" అని ప్రశ్నించాడు.

"మామూలేనండీ ! ఎవరి కాపురాలు, ఎవరి స్వార్థాలు వారివి. నేను నా తమ్ముళ్ళని తప్పుపట్టట్లేదు. వారి పరిస్థితి వారిది. కానీ నా బాధంతా కన్న తల్లీ తండ్రీ కూడా నన్ను ఒంటరిని చేసి నీ దోవ నువు చూసుకోరా ! మేము వాళ్ళ దగ్గరికి వెళ్ళిపోతున్నాం" అని నన్ను అనాథని చేసి నిలువనీడ లేకుండా చేసి వారిద్దరూ తమ్ముళ్ళ దగ్గరికి వెళ్ళిపోయారు" అంటూ ఒక్కసారిగా వెక్కివెక్కి ఏడుస్తున్న మాధవరావుని చూసి చలించిపోయాడు రామచంద్రయ్యా. నెమ్మదిగా లేచివచ్చి అతని భుజంపై చేయివేసి,

"ఊరుకో మాధవరావ్ ! ఊరుకో", అంటూ అనునయించాడు. ఒక్కసారిగా కట్టలు తెంచుకుని దూకిన మది వరద ఆగడానికి కాస్త సమయం పట్టింది. ఇన్నాళ్ళుగా లోలోపల అణిగివున్న వేదన ఒక్కసారిగా ఎగసింది. కాసేపటికి గంభీరాన్నంతా కూడగట్టుకున్న మాధవరావు, "చూడండి రామచంద్రయ్యగారూ ! కన్నవారిని చూడని పిల్లలు ఎలా వున్నారో ? పిల్లలని చూడని, పట్టించుకోని కన్నవారూ అలాగే వున్నారు. నేను వయసులోనే వున్నాను, చదువులేదు - ఆస్థిలేదు. చివరికి నను దరిచేర్చుకుని ఆదరించే అయిన వారెవ్వరూ లేరు. నేనెలా బతకాలి ? నాకుదోవ ఏది ? వృద్ధాప్యంలో మిమ్మల్ని ఆదరించలేదని పిల్లల్ని దూషిస్తున్నారే ! మరి కన్నవారే నన్ను అనాథని చేసి వెలేసారు. అలా అని నాకేం వారిపై ద్వేషం లేదు. బాధ. తీరని దుఃఖం అంతే. అంటూ కళ్ళు తుడుచుకున్నాడు మాధవరావు.

"మరి మీ తమ్ముళ్ళేం అంటారు ? నిన్ను కూడా వారి దగ్గరికి రమ్మనలేదా ?" అంటూ ప్రశ్నించాడు రామచంద్రయ్య.

"ఇంకేమంటారండీ ! వాళ్ళు మాత్రం ఎందరిని పోషిస్తారు ? వాళ్ళు జులాయిల్లా తిరిగినప్పుడు ఎంత కావాలంటే అంత డబ్బు పంపేదాకా వూరుకునే వారు కాదు అమ్మావాళ్ళు. పెద్దవారిగా పిల్లల్ని కట్టడి చేసే ప్రయత్నమే చేయలేదు. వాళ్ళనే సమర్థించారు. కానీ ఇప్పుడు వాళ్ళకి నా గురించి వివరించే చొరవ తీసుకోనేలేదు. వారు నాకన్యాయం చేసినట్టు కాదా ? చెప్పండి" అన్నాడు కాస్త కోపంగా మాధవరావు. "మరి అలాటప్పుడు ఆ పొలం చూసుకుంటూ నీ దగ్గరే వుండొచ్చుగా ?" అన్నాడు మరో అనుమానపు ప్రశ్న సంధిస్తూ రామచంద్రయ్య.

"అదే మాట నేనూ అన్నానండీ ! కానీ వాళ్ళకి బిజినెస్‌లో పెట్టుబడికి డబ్బు కావాలిట. పొలం అమ్మేసి డబ్బుతో సహా వచ్చేయమని తమ్ముళ్ళ ఆజ్ఞ. నాకా వ్యాపారానికి కావల్సిన చదువు, చాకచక్యం లేవు. ఇక నేనెందుకండీ వాళ్ళకి. వాళ్ళేం చేసినా ఎదురు చెప్పే ధైర్యం నాకు లేదని తెలిసే వారీపని చేసారు" అన్నాడు. "అయితే నా కొడుకుల్ని నే దూరం చేసుకోవటం తప్పంటావా ?" అన్నాడు ఏదో ఆలోచిస్తున్నట్టుగా రామచంద్రయ్య.

"ఖచ్చితంగా ! వారేం మిమ్మల్ని చూడమని అనలేదుగా ! వాళ్ళు ఇక్కడే వుండి మిమ్మల్ని చూడాలనటం తప్పని నా అభిప్రాయం. మీరూ వారికి ప్రాముఖ్యం ఇవ్వాలి. వారి జీవనాధారం కోసం వారు పరాయిదేశం వెళ్ళారు.

వారు మిమ్మల్ని రమ్మన్నప్పుడు మీరు వెళ్ళవచ్చు కదా ! బయటవారికైనా నమ్ముతారు కానీ, ఏదో మాటా, మాటా అనుకున్నా, మీ పిల్లలే కదా ! అని ఓర్పు వహించరేం. పిల్లలు దూరమయ్యారని బాధపడండి - ద్వేషించవద్దు. ఉద్యోగ అవకాశాలు మనం అనుకున్నట్టుగా రావద్దూ. మీరే కాదు అక్కడ వాళ్ళూ ఒంటరివారే. కాస్త మనసుపెట్టి ఆలోచించండి" అంటూ రామచంద్రయ్యగారిని చూసిన మాధవరావుకి ఆయనలో మార్పు స్పష్టంగా కనిపించి, "మరోమాట, మంచి చెడులకి - కొడుకులనీ, తల్లిదండ్రులనీ, ఆడనీ, మొగనీ - చిన్నా, పెద్దా అనే తేడాలు లేవు. మనకేదో జరిగిందని మొత్తం ఆ జాతినే ద్వేషిస్తే ఎలా ? చెప్పండి. నేనైనా అదే చేసాను. నాకున్న కాస్త డబ్బునీ చేతపట్టి వద్దనుకున్నవారికి దూరంగా వచ్చేసాను. ఆశ్రయమిచ్చిన మీకు అప్తుడనయ్యాను. కాకపోతే ఓ వృద్ధుని వేషంలో. ఇంతకన్నా నాకేం దిక్కుతోచలేదు. మీ వృద్ధులకైనా ఇలా సేదతీర్చే కుటీరాలున్నాయి. కానీ మా వయసు వారికి ఎక్కడున్నాయి ? చెప్పండి. దిక్కులేనివారికి దేవాలయం లాంటి ఈ ఆశ్రమమే దిక్కని తలచి నేనీ పని చేసాను. ఇదీ నా గతం. అంతా విన్నారుగా ! ఇప్పటికీ నేచేసింది మీకు తప్పని అనిపిస్తే చెప్పండి. తెల్లారేసరికి మీ కంటికి కనపడకుండా వెళ్ళిపోతాను" అన్నాడు మాధవరావు, రామచంద్రయ్య చేతులు పట్టుకుని.

"మీ గతం తెలియక ఏదో ఉద్రేకంలో అనేసాను. కానీ మీ విషయం యాజమాన్యానికి తెలిస్తేనే ప్రమాదం. తెల్లారవచ్చింది. ఇక నే వెళ్తాను. మిగిలిన విషయాలు రేపు మాట్లాడుకుందాం. తలుపులు వేసుకోండి" అని చెప్పి కండువా భుజాన వేసుకుని గబగబా బయటికి వెళ్ళాడు రామచంద్రయ్య.

గదికి తిరిగి వచ్చిన రామచంద్రయ్య తనకి తానే కొత్తగా అనిపించాడు. గబగబా కొడుకుల అడ్రస్‌లూ, ఫోన్ నెంబర్లూ వెతికి బయటికి తీసాడు. ఆల్బమ్ తీసి తన కుటుంబ ఫోటోలన్నీ చూసుకున్నాడు. వెలుగు కిరణాలు నేల జారగానే, వెళ్ళి కొడుకులిద్దరికీ ఫోన్ చేసి మాట్లాడాడు. మనమళ్ళ పలకరింపూ, కోడళ్ళ ఆప్యాయతా ఆయన్ని ఆనందంలో ముంచేసాయి. గాలిలో తేలుతున్న అనుభూతి. ఆ సంతోషాన్ని మాధవరావుతో పంచుకోటానికి అతని గదికేసి బయలుదేరాడు. అప్పటికే అతని గదిముందు అందరూ గుమిగూడి వున్నారు. రామచంద్రయ్యగార్ని చూడగానే కేశవయ్య ఎదురొచ్చి, "ఏమయ్యారు మీరు ? గదిలో లేరు. ఈ విషయం తెలుసా ? మాధవరావు చనిపోయాడు. తెల్లారిగట్ట హార్ట్ ఎటాకంట" అన్నాడు. అంతే ఆ మాటలు విన్న రామచంద్రయ్య బిగుసుకుపోయాడు. ఒక్కసారిగా గుండె బండ అయినట్టనిపించింది. "ఎంత దారుణం ! జరగరానిది జరిగింది. ఓ రెండుగంటల వ్యవధిలో వూహించని పరిణామం. ఓ రకంగా అతని మరణానికి తనే కారణం. గతం తాలూకు మాటలు అతని హృదయాన్ని బాగా దెబ్బతీసాయి. ఉద్వేగం తట్టుకోలేక అతని గుండె ఆగిపోయివుంటుంది. అతని గీతోపదేశం ఫలితంగా తనువెళ్ళి తన కొడుకులతో మాట్లాడివచ్చానని తెలిస్తే ఎంత సంతోషించేవాడో "! అనుకుంటూ గదిలోకి అడుగుపెట్టిన ఆయనకి కళ్ళముందు మాధవరావు శవం ఏదో సంకేతాన్ని చెపుతున్నాయి అని పెదవులు. తెల్లారేసరికి కనపడకుండా వెడతానన్న అతని మాటలు ఈరకంగా జరుగుతాయని ఊహించలేకపోయారు రామచంద్రయ్యగారు.

అప్రయత్నంగా కన్నీళ్ళు కారాయి రామచంద్రయ్యకి. ఎవరినో కాదు వయసు పండటం ప్రకృతి సహజమనీ, మనసు పండటమే సుకృతమనీ తెలియజెప్పిన ఆప్తుడు దూరమయ్యాడనే ఆవేదన ఆయన వదనంలో కనిపించింది. తను తన కొడుకులతో మళ్ళీ దగ్గర కాబోతున్న సత్యం అతని ఆత్మకు తప్పక శాంతిని కలుగజేస్తుందనే నమ్మకంతో ఓ రెండు క్షణాలు కళ్ళుమూసుకుని నిలుచుండి పోయాడు రామచంద్రయ్య.

ఓ వారం రోజులు ఎంతో భారంగా గడిచాయి రామచంద్రయ్యకి. దూరమైన నేస్తం ఆలోచనలతో తన యధాస్థానంలో ఆలోచనలతో సాన్నిహిత్యం చేస్తున్న ఆయనకి ఎవరిదో పిలుపు వినపడి వాస్తవంలోకి వచ్చారు.

"ఏమండీ ! ఇక్కడ రామకృష్ణారావుగారుట. ఎక్కడుంటారండీ ? నేనాయన్ని కాస్త కలవాలి" అన్నాడో వృద్ధుడు.

ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది రామచంద్రయ్య గార్కి. అప్రయత్నంగా అలా చెయ్యెత్తి ఆఫీసురూమ్ కేసి చూపించాడు. మాట్లాడించే ధైర్యం చెయ్యలేకపోయారాయన. ఆయన మదిలో మరో ప్రశ్న ఉద్భవించింది. కానీ మరో రెండు రోజుల్లో తను తన చిన్న కొడుకు దగ్గరికి వెళ్ళిపోతున్నాడు. మరి తన మదిలో మొదలైన ప్రశ్నకి జవాబు ఏమైవుంటుందా ?'' అనే ఆలోచనలలో వుండిపోయారు పండిన - పండు వృద్ధుడు రామచంద్రయ్య గారు. ❋

# గులాబిబాల

అది వొక చక్కని ఉద్యానవాటిక
దాపున గులాబీలతో అలరారు తోట
అందు కనబడుచున్నదొక రోజా బాల కంట తడిబెట్టి
అంత లేత వయస్సున ఆ వగపేటికో తెలియరాదయ్యె !

చెట్టు పుట్టల చుట్టు తిరిగి తిరిగి
నడురాత్రి యరుదెంచె నల్లరెక్కల పురుగు
గాలి వాన తాకిడికి వోపలేక
ఆశ్రయింప వచ్చె అతిథివైనమున

కడుడస్సి నాడవు కాస్త కునుకుదీసేవు
మరలి పోయెదవయో మర్యాదగాదనె
అంతరంగమందు ఆళి ఆనందమొంది
బ్రతికె నటంచు సుమబాల పక్కచేరె

ఏమి ఆలోచన చేసెనో యింతలోనే
దొంగ నిద్ర నటించి ఆదొపుగాడు
అదమరచి నిదరోవు పూబాల నాక్రమించి
లొట్టలేయుచు యెదను పీల్చి పిప్పి చేసి
తూటు పొడచి చనియె తూరుపారకమున్నె

పువ్వుకేల తెలియదో తుమ్మెద తత్వంబు
మైకంబుగ్రమ్మునే దాని మేను గాలి సోకగానే !
మెత్తగా ఉంటె వత్తబుద్ధి యెయ్యెదా !
తెలిసి చేసిన తప్పు తేటికేల అంటగట్టు ?

**- కొలమచలమ సూర్యనారాయణ**

# టి.వి. సీరియల్స్

"ప్రియాంక "సుప్రభాతం" అవుతూనే లేచింది. "ప్రియాంక", "ఈ తరం అమ్మాయి" అన్నింటా ముందుంటుంది. అన్నింటిలో "ఈ తరం అమ్మాయి" అయిన "ప్రియాంక"కి "జయం" సిద్ధిస్తుంది కానీ "ప్రియాంక" ఒక "పద్మవ్యూహం"లో చిక్కుకుపోయింది. తన తల్లిదండ్రులు పెళ్ళి చేస్తామంటూ పోరుపెడుతున్నారు. ఇది ప్రతి ఇంటా ఉండే "ఈనాటి రామాయణం". పోనీ "తలంబ్రాలు" పోయించుకొని సెటిల్ అవుదామంటే తను సాధించాల్సింది చాలా ఉంది. "ప్రియాంక" పెళ్ళి అనే "చదరంగం"లో ఇరుక్కుపోదల్చుకోలేదు. "నా మొగుడు నాకు సొంతం" అనుకుంటూ "ఎండమావులు" లాంటి జీవితం జీవించ దల్చుకోలేదు. కుటుంబం అంటే అన్నీ "సుఖదుఃఖాలు" నాన్న ఒక "మట్టిమనిషి". తనలో సుడులు తిరిగే "అంతరంగాలు" అర్థం చేసుకోలేదు. "ఇది కథ కాదు" జీవితం. తను నేర్చుకున్న కళ (నాట్యం) కలగానే మిగిలిపోకూడదు. "కళంకిత"లా తను కళకు అంకితం అవ్వాలని పట్టుదలతో "ప్రియాంక" ఆ "పంజరం"లోంచి బయటపడింది.

**- ఈ. సునీత**